

విచక్షణ

ముద్దంశెట్టి హనుమంతరావు

వెంకట్రామయ్య వాలుకుర్చీలో చేరబడి, చుట్ట కాలుస్తున్నాడు. అతని మెదడులో చీకటి ఆలోచన లేవో సాగుతున్నాయని, నుదురు, కనుబొమలు ముడుచుకుపోయిన తీరు చూస్తేనే తెలిసిపోతుంది.

వెంకట్రామయ్యకి యెదురుగా నిల్చున్న గంగులు, బిగుతుగా పంచె

కట్టి, లాండోబనియన్‌తో వస్తాదులా అగుపిస్తున్నాడు. అతడి మొహంలోనూ, కళ్ళల్లోనూ, కాస్తంత క్రూరత్వం కనిపిస్తుంది. అందుకేనేమో, గంగుల్ని తనకి ఆంతరంగిక వ్యక్తిగా పెట్టుకున్నాడు, వెంకట్రామయ్య.

"గంగులూ ..." గంభీరంగా అన్నాడు, వెంకట్రామయ్య.

"బాబూ..." సవినయంగా చేతులు కట్టుకుని అన్నాడు, గంగులు

"మా రామ్మూర్తి యేంజేశాడో తెల్సుకదూ నీకు ?"

"తెలవకేం బాబూ ? ఇన్నేళ్ళు తవఁరి దగ్గిర పెరిగి పెద్దోరై, ఇప్పుడు యిడిగా యెల్లిపోడం, యేం సబబుగా నేదు బాబూ !"

వెంకట్రామయ్య గంగులుకేసిచూసి, ఆదోలాంటి నవ్వు నవ్వేడు.

"ఔనా మరి ? నీకున్నపాటి జ్ఞానం, వాడికి లేకపోయిందిరా; వాళ్ళనాన్నగారి ఆస్తిని నేను కాజేశానని అంటున్నాడు బడద్దాయి. వాళ్ళ నాన్నా, అమ్మా పోయాక, వాణ్ణి చేరదీసి, యిన్నేళ్ళు పెంచి, పెద్దచేసిన నా మంచితనాన్ని, నా విశాలహృదయాన్ని మర్చిపోయి, యిప్పుడు నన్నే నిందిస్తున్నాడు. అటువంటి కృతఘ్నుణ్ణి యేంజేస్తే పాపం చెప్పు ?"

"ఆ బాబుగారు అలా అనడం నేయంగా నేదండీ ! ఎంతయినా సిన్నాన్నగోరు తవఁరు. తవఁరుమాత్రం ఆ బాబుగారి బాగోగులు సూడ్రాయేటి ? ... ఆ బాబుగారి తెలివితక్కువ తనంగాని..."

"వాడది అర్థంచేసుకోలేదురా ! పైగా, నామీద కత్తిగట్టాడు. నన్ను రచ్చకీడ్చి, అవమానపరుస్తాడట ... వాడి కెంత పొగరో చూడు. వాడికి చేసిన సహాయంలో పదోవంతు నీలాంటి వాడికి చేసి ఉంటే, జన్మజన్మలకి మర్చిపోయేవాడివి కాదు..."

"ఇప్పుడైనా తవఁర్ని మర్సిపోతానేటి బాబూ ?" సవినయంగా చేతులు నులుము కుంటూ అన్నాడు, గంగులు.

"ఔననుకో. అందుకే, యిప్పు డను కుంటున్నాన్రా ... ఇంకెవరికయినా సహాయం చేసేముందు, నిన్ను బాగు పర్చాలని; నీకో అంతస్తు తీసుకు రావాలని."

వెంకట్రామయ్య మాటలకి, మురిసి పోయాడు గంగులు.

"తవఁరి దయుంటే సాలు బాబూ ! తవఁరి పాదాలదగ్గర బతుకుతున్నోణ్ణి." కృతజ్ఞతాపూర్వకంగా అన్నాడు.

"నీకున్నపాటి ఆప్యాయత, నాయం దుండే గౌరవమూ, మా రామ్మూర్తికి లేకపోయిందిరా ! అందుకే, వాడిమీద కసి పెరిగిపోతుంది. అటువంటి కృతఘ్నుడి పొగరు అణచా లనిపిస్తుంది."

"తమరికే గాదు. ఎవరికైనా అట్టాగే అనిపిస్తది బాబూ !"

"వాడి పొగరు అణచాలని, యీ వెంకట్రామయ్య అంటే యేమిటో చూపెట్టాలనుందిరా. అది, నీ చేతిలో ఉంది ..." గంగులు మొహంలోకి చూస్తూ అన్నాడు వెంకట్రామయ్య.

గంగులు గతుక్కుమన్నాడు. తన చేతిలో ఉండటమేవిఁటా అన్న సందేహం కలిగింది వాడికి.

"నా సేతిలోనా బాబూ?" అన్నాడు.

"ఔన్రా !"

"సెప్పండి బాబూ ! మీరేం సెప్తే అదే సేత్తాను. మీ పాదాల దగ్గిర పడునోణ్ణి..."

వెంకట్రామయ్య, నిండుగా ఓ నవ్వు నవ్వేడు. కాలుస్తున్న చుట్ట పారేసి, జేబులోంచి కొత్త చుట్ట తీసి వెలిగించాడు. మరో చుట్ట తీసి, గంగులుకి అందించాడు. "నువ్వూ కాల్చరా..." అంటూ.

గంగులు నివ్వెరపోయాడు. యజమాని స్వయంగా చుట్ట అందించడం, అదే మొదటిసారి.

"కాల్చరా..."

"తర్వాత కాలుస్తాలెండి బాబూ :" అంటూ మొల్లో దోపుకున్నాడు.

"ఒరేయ్ గంగులూ ! నువ్వు రామ్మూర్తిని మరో లోకానికి పంపాలిరా !" అంటూ మెల్లగా చెప్తూ, పీక తీసెయ్యాలన్నట్టు సౌంజ్ఞచేశాడు.

గంగులు షాక్ తిన్నట్టుగా అదిరిపోయాడు. వాడి మొహంలో రంగు మారింది.

"బాబూ ... " అని యేదో చెప్పబోయాడు వాడు.

"నువ్వు మరేం అనకు. వాడి ఆస్తి మళ్ళీ నా ఆస్తిలోనే కలవాలి. అందులో నీకు కొంతభాగం ఉంటుంది. నీ స్థాయి పెరగాలని నేననుకుంటున్నట్టు చెప్పాను కదరా ! ఈ విషయం మూడో వ్యక్తికి తెలీకూడదు."

"మరి ... " మళ్ళీ యేదో అనబోయాడు, గంగులు.

"మరేం లేదు. వాడు యీ రాత్రి పట్నంనుంచి తిరిగి వస్తున్నాడు. తోటలో వాణ్ణి అంతంచెయ్యి. దొంగలెవరో ఆ పనిచేశారని ప్రచారం చేద్దాం. మిగతా విషయాలు నేను చూసుకుంటాను. కత్తిమాత్రం కాలువలోకి విసిరేయ్... అది నీ దగ్గరుండటం మంచిదికాదు." అంటూ సలహా యిచ్చాడు.

యజమాని చూపిన యెరకి లొంగిపోయిన గంగులు, కాదనలేకపోయాడు.

"మరేం పెమాదం నేదంటారా ?" వాడి గొంతు, కాస్తంత కంపించింది.

"నేనుండగా నీకు ప్రమాదమేమిట్రా ! నారాయుడు యెలా చచ్చిపోయిందీ, యింతవరకూ యెవరికయినా

తెలిసిందా ? అలాగే ! గతాన్ని గుర్తు చేశాడోసారి.

గంగులు మరేం మాట్లాడలేక పోయాడు.

"సరే బాబూ !"

"భేష్. అలా ఉండాలిరా స్వామి భక్తి అంటేను. అందుకే నిన్నో మనిషిని చేద్దామనుకుంటున్నాను ..." చిన్నగా నవ్వుతూ అన్నాడు, వెంకట్రామయ్య.

"తమ(రి దయ..."

"వెళ్ళింక... ఇదిగో, యీ అయిదు రూపాయలు తీసుకెళ్ళి, కాస్త చుక్కేసుకుని మరీ వెళ్ళు. లేకపోతే, ఆ ఫోర్సు రాదు." అంటూ అయిదు రూపాయిలు తీసి అందించాడు, వెంకట్రామయ్య.

గంగులు హుషారుగా ఆ నోటు అందుకుని, నిష్క్రమించాడు.

వెంకట్రామయ్య సగర్వంగా లోలోన నవ్వుకున్నాడు.

* * *

రాత్రి యెనిమిది కావస్తోంది, గంగులు రెండు గ్లాసుల సారా యెక్కించేసి, కత్తి పట్టుకుపోడానికి, యింటికేసి నడిచాడు.

ఇల్లు చేరేకునేసరికి, గంగులు భార్య రంగి యేడుస్తోంది. ఆమె చుట్టూ నలుగురైదుగురు ఆడవాళ్ళు కూచున్నారు. గంగులుకి అర్థంకాలేదు.

"ఏటయ్యిందే రంగీ?" ఆతృతగానే అడిగాడు.

"వచ్చినావా! సిన్నోడికి వల్లమాలిన జొరం వచ్చేసినాది. కళ్లు తెరవడం నేదు. నాకేందో భయంగా ఉంది," అంటూ భోరుమంది.

గంగులుకి, ఉన్న కాస్త మత్తూ వదిలిపోయింది. కొడుకుని తాకాడు. సలసల కాగుతోంది.

"డాకటేరు దగ్గిరికి తీసుకెళ్దాం పదే !" అంటూ కొడుకుని భుజమ్మీద వేసుకుని బయల్దేరాడు. వాడికి మరో ఆలోచన లేదు. వాడివెంట రంగి కూడా వెళ్ళింది.

డాక్టరు, ఆ చంటివాణ్ణి తనిఖీచేసి, ఓ ఇంజక్షను యిచ్చాడు. రాత్రిదాటితే, ఫరవా లేదన్నాడు.

ఆ రాత్రంతా గంగులు, రంగి చంటాడి దగ్గరే కూచున్నారు.

గంగులు అక్కడ చంటాడి దగ్గర కూచున్నాడేగాని, వాడి ఆలోచనలు రామ్మూర్తిమీదే ఉన్నయ్. వెంకట్రామయ్య చెప్పిన మాటలు, వాడి చెవుల్లో గింగురుపెట్టాయి. తాను ఒక స్థాయికి రావాలంటే, డబ్బు గడించాలంటే, రామ్మూర్తిని చంపాలి, కాని...కాని... తర్వాత తను పట్టుబడితే ... ? ... జైలు కెళ్ళాలి. ఉరిశిక్ష పడినా పడుతుంది. అప్పుడీ వెంకట్రామయ్య అడ్డు పడతాడా ? తప్పుకుంటాడు. తన

పెళ్ళాం, పిల్లలు ముష్టెత్తుకు తిరుగు తారు ... అయినా తన స్వార్థంకోసం, తన మంచికోసం రామ్మూర్తిలాంటి మంచి మనిషిని చంపడమా ? వెంక ట్రామయ్య, తనచేత ఆ పని చేయించి, తరువాత మొండిచెయ్యి చూపిస్తే ... ? ... రామ్మూర్తి బాబుకి అన్యాయం తల పెట్టడంవల్లనే గామోసు, తన కొడుక్కి అంత బాగులేకపోయింది ! ఇదంతా దేవుడి మాయా ?... యిలా ఆలోచనలు సాగినయ్ గంగులు మెదడులో. వాడి మొహం చెమటతో నిండిపోయింది. చూపుల్లో ఆరాటం అగుపించింది. ఇదంతా గమనిస్తున్న రంగి, కంగారు పడింది.

"ఏటయ్యింది మావా ? ఎందుకలా అయిపోతన్నావు ? మొహం నిండా ఆ సెవఁటేటి ?" ప్రశ్నలవర్షం కురిపించింది, రంగి.

గంగులు, మొదట్లో చెప్పకూడ

దనుకున్నాడు. కాని, చెప్పడమే మంచి దనుకున్నాడు. భారంగా ఓ నిట్టూర్పు విడిచి, అంతా చెప్పాడు.

రంగి, గుండెలు బాదుకుంది.

"ఎంత గోరం జరిగి పోను! సిన్నోడికి ముంచుకు రాపోతే, అన్నేయంగా రామ్మూర్తి బాబుగోరి పేణాలు పోనుగదా! అయినా పెద్ద బాబు సోర్దంతో సెప్పారే అనుకో... నువ్వు సేసీడవేనాయేటి? ఆ తర్వాత మా గతేంగాను! ఇదంతా దేవుడి మాయలాగుంది మావాఁ! అంత మంచి బాబుకి అన్నేయం సెయ్యడానికి నువ్వు తలపెట్టినావు గాబట్టే, దేవుడు మనకి అన్నేయం తలపెట్టినాడు. ఇట్టాంటి అన్నేయాలు సెయ్యడానికేనా, నువ్వు పెద్దబాబు దగ్గిర పనిచేస్తంది? వొద్దు మావాఁ... ఇంక అక్కడ పనొద్దు. కూలిసేసుకుని నేయంగా బతుకుదాం." యేడుపు స్వరంతో అంది, రంగి.

గంగులు ఆలోచించాడు. అతడిలోని విచక్షణా జ్ఞానం, వొళ్ళు విరుచుకుని లేచింది రంగి చెప్పింది సబబుగానే తోచింది వాడికి. రామ్మూర్తిబాబుని దేముడే కాపాడినట్టనిపించింది వాడికి.

"ఔనే రంగీ, శానా గోరం జరిగి పోను. దేముడే తప్పించినాడనుకో, ఇంకెప్పుడూ యిటువంటి పనులు సెయ్యడానికి ఒప్పుకోన్లే. నీ మీ దొట్టు..."

రంగి తృప్తిగా నవ్వుకుంది. అప్పుడే చంటాడు కళ్ళు తెరిచాడు.

"సూసినావా దేవుడి మాయ..." మురిసిపోతూ అంది, రంగి.

గంగులు మొహంలో కొత్త వెలుగొచ్చింది. రెండు చేతులూ జోడించి, కనిపించని దేవుడికి దండంపెట్టాడు.

* * *

మర్నాడు, వెంకట్రామయ్య గంగుల్ని ఛెడా మడా తిట్టాడు. అంతా సహనంతో విన్నాడు, గంగులు. "ఏటి బాబుగోరూ అలా నోరు పారేసుకుంటారు? నే నీ అన్నేయప్పనికి ఒప్పుకున్నాను గాబట్టే, నా బిడ్డ రాత్రి సావు బతుకుల్లో ఉన్నాడు. రాత్రంతా ఆడిదగ్గిరే కళ్ళల్లో ఒత్తులు పెట్టుకుని కూసున్నాం నానూ, రంగీను. అదృష్టం బావుండి ఆడు బతికినాడు బాబూ. నా నింకెప్పుడూ అటువంటి అన్నేయానికి పూనుకోను. నా బిడ్డలు సుకంగా ఉండాలని నాకూ వుంటది బాబూ! రాత్రి జరిగిందంతా దేముడి మాయలా కనిపిస్తంది ..." అంటూ చెప్పుకుపోయాడు, గంగులు.

వెంకట్రామయ్య విస్తుపోయాడు. గంగులు అలా మారిపోవడం, అతని కిష్టంలేదు.

"ఏవిఁట్రా అలా మాట్లాడుతున్నావు? మీ అబ్బాయికి బాగులేక



పోడానికి, నువ్వు చేసేపనికీ సంబంధం యేముందని ? దేని కదే !"

"మీ రెన్ని సెప్పండి బాబూ ! నాను మాత్రం యింకెప్పుడూ అటువంటి పనులు సెయ్యనంటే సెయ్యను. ఆ పైన మీ యిట్టం ..." ఖచ్చితంగా చెప్పేశాడు, గంగులు.

వెంకట్రామయ్యకి వొళ్ళు మండి పోయింది. కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రగా మెరుస్తున్నయ్. రాంమ్మూర్తిని చంపేశాక, వాడిలో మార్పు వచ్చినా బాగుండేది. కాని, వాడిప్పుడే మారి పోయాడు. అనుకుని మళ్ళీ ఓ ప్రయత్నం చేశాడు.

"అంతే అంటావా ?" కోపంగానే అడిగాడు.

"అంతే బాబూ ! మీ దగ్గిర పని మానేయమంటే మానేత్తాగాని, అన్నేయా లింక సెయ్యను బాబూ."

వెంకట్రామయ్యకి యేంచెయ్యాలో పాలుపోలేదు. కోపంతో వాణ్ణి పన్లో నుంచి తీస్తే, వాడు తిన్నగా పోయి రామ్మూర్తి దగ్గర చేరిపోతాడు. అంతే కాదు ... తన గుట్టులన్నీ వాడికి తెలుసు...వాటిని ప్రచారం చేస్తాడు... అంచేత, తన కోపం తనకే ముప్పు తెస్తుంది ... అనుకున్నాడు. ఏమీ జరగనట్టు ఓ చిన్న మందహాసం చేశాడు.

"సరేలేరా ! నిన్నే విషయం లోనూ బలవంతం చెయ్యనుగా ! ఈ సంగతంతా మర్చిపో..." అన్నాడు.

"అది, తమరు సెప్పాలా బాబూ!" నవ్వుతూ అనేశాడు, గంగులు.

ఆ రోజునుంచీ, వెంకట్రామయ్యలో చాలా మార్పు వచ్చేసిందంటే, అతిశయోక్తికాదు.